కార్తికం.. నమోహం

- పవిత్ర కార్తిక మాసానికి సర్వం సిద్ధం
- మోర్తోట ముక్తేశ్వరుని ఆలయంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

రేపల్లె: శివ కేశవులకు ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తిక మాస పూజలకు నియోజకవర్గంలోని అన్ని శైవలయాలు ముస్తాబవుతున్నాయి. శివుడికి ఇష్టమైన కార్తికం మాసంలో ఆలయాలకు వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. మోర్తోటలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, అరవపల్లిలోని బాలకోటేశ్వర స్వామి దేవాలయం, పెనుమూడిలోని శివాలయం, రామాలయం, పట్టణంలోని పలు శైవాలయాలు ఇప్పటికే అన్ని హంగులతో తీర్చిదిద్దారు. ముఖ్యంగా మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి ఆలయం కృష్ణానది తీరంలో ఉండటంతో కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడికి విచ్చేస్తుంటారు. దీంతో ముక్తేశ్వరస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

మోర్తోట స్థలపురాణం ఇదే...
కృష్ణమ్మ తీరాన వెలసిన మోర్తోట ముక్తేశ్వర స్వామి తీరప్రాంతం ఎంతో మహిమకలిగిన దేవాలయంగా ప్రసిద్ధి చెందింది. వేలసంవత్సరాల చరిత్ర కలిగిన స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆలయ చరిత్రపై స్థానికులు కథలు కథలుగా చెప్పుకొంటుంటారు. పూర్వం హిమాలయ పర్వత రాజ్యమందు జ్ఞాన ముని, సుచరిత దంపతులకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఏకమూర్తిగా త్రినాథుడు జన్మించారు. త్రినాథుడు 5వ ఏట నుంచే వేద పాఠశాలలో చదువుకుంటున్నాడు. రావణాసురుడి వంశానికి చెందిన రాకాశి అనే రాక్షసి తన శరీరమును ఆకాశపు హద్దు వరకు పెంచి ఆ సమయంలో పూజా కార్యక్రమాలలో నిమగ్నమైన మునులపై తన నోటితో గాలిని ఊదగా ఆమె నోటి వెంబడి పెద్దగాలి వానగా మారటంతో మునులందరూ చెల్లాచెదురయ్యారు. సమయం చూసుకుని త్రినాథుడిని తన భుజాన వేసుకొని వాయువేగాన హిమాలయాల నుంచి దక్షిణాన ఉన్న మోర్తోట గ్రామానికి తీసుకొచ్చింది. రోదిస్తున్న తల్లిదండ్రులను చూసిన త్రిమూర్తులు దక్కించరాదని కారణ జన్ముడైన త్రినాథుడు ముక్తిని పొందబోతున్నాడని చెప్పిరి. రాకాశి త్రినాథుడి శిరస్సును కొరికివేసి ఆ శిరస్సును కృష్ణానది తీరం వెంబడి విసిరివేయగా ఆ శిరస్సు నుంచి లింగోద్భవమైనది. దీంతో ముక్తి చెందిన త్రిమూర్తులు స్వయం భూ లింగమైన లింగాకారానికి ముక్తేశ్వరుడని నామకరణం చేయడం జరిగింది. త్రినాథుడు ముక్తిని పొందిన ప్రదేశం కాబట్టి మోర్తోటగా మారింది. మిగిలిన శరీరాన్ని రాకాశి ఉత్తర భారతదేశంలో పడవేయగా గంగా నది తీరంలో పడి లింగాకారం పొందింది. దీంతో ఆ ప్రాంతం రాకాశి పేరు మీదగానే కాశీ అని నామకరణం పొందింది. అనంతరం త్రిమూర్తులు ఆ రాకాశిని సంహరించారు. దీంతో నాటి నుంచి మోర్తోట దక్షిణ కాశీగా పేర్గావించి ముక్తిని అందించే ముక్తేశ్వరస్వామి నాటి నుంచి భక్తుల పూజలు అందుకుంటున్నాడు.


మోర్తోటలోని ముక్తేశ్వరస్వామి దేవాలయం


ముక్తేశ్వరస్వామి


పార్వతి అమ్మవారు

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం..
ఈ నెల 13వతేదీన కార్తికమాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటికే ఆలయంలో ఏర్పాట్లును పూర్తి చేశాం. బాపట్ల జిల్లాతో పాటు సమీపంలోని జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ముక్తేశ్వరస్వామిని దర్శించుకునేందుకు విచ్చేస్తుంటారు. ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఎటువంటి లోటు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం.
– చావలి సురేష్‌శర్మ, ఆలయ అర్చకుడు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పోటుమెరక, గంగడిపాలెం, లంకెవాని దిబ్బ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డీఈ ఎస్.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహిళా చట్టం ఆమోదంలో కేంద్రం ద్వంద్వ వైఖరి

భట్టిప్రోలు: మహిళా చట్టం ఆమోదంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన ద్వంద్వ వైఖరి విచారకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. సోమవారం ఆయన భట్టిప్రోలులో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రపతి ఆమోదించిన మహిళా బిల్లు 33 శాతంలో చాలా లొసుగులు ఉన్నాయన్నారు. చట్ట సభల్లో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచాలని వారి ప్రతిభా పాటవాలను దేశం, ప్రజల కోసం ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో దేవగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో 81వ సవరణ బిల్లులో 1996 సెప్టెంబర్ 12న లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం తెలపకుండానే ఆ సభలో రద్దయిన విషయాన్ని గుర్తు చేశారు. రెండోసారి ప్రధాని వాజ్‌పాయ్ 1999లో బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టగా అది ఆమోదించబడలేదన్నారు. మూడోసారి 2003లో ప్రధాని వాజ్‌పాయ్ లోక్ సభలో బిల్లు ప్రవేశ పెట్టగా ప్రస్తుతం ఆమోదించమని అప్పటి ప్రతిపక్ష పార్టీలు అడ్డుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో డిసెంబర్12న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ఒక రోజు దీక్షను జయప్రదం చేయాలని కోరారు.

ఉత్కంఠభరితంగా స్పీడ్ సైక్లింగ్

- మొదటిస్థానంలో నిలిచిన చీరాల యువకుడు, పిట్టలవానిపాలెం యువకుడికి రెండో స్థానం
- ముగిసిన డాక్టర్ వైఎస్సార్ స్మారక రాష్ట్రస్థాయి సైకిల్ పోటీలు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండల కేంద్రంలో దీపావళి పర్వదినం సందర్భంగా నిర్వహించిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 11వ స్మారక రాష్ట్రస్థాయి స్పీడ్ సైక్లింగ్ పోటీలు ఆదివారం ప్రశాంతగా ముగిశాయి. రాష్ట్ర నలుమూలల నుంచి మొత్తం 14 మంది క్రీడాకారులు ఈపోటీలలో పాల్గొన్నారు. మొదటి బహుమతిని చీరాల మండలం చీరాల గ్రామానికి చెందిన గుండిమెడ సిద్ధార్థ రెడ్డి సాధించగా, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ నాయకుడు గాదె మధుసూదనరెడ్డి రూ.50,116 నగదుతో పాటు షీల్డును అందజేశారు. రెండవ బహుమతిని పిట్టలవానిపాలెం మండలం పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన రావూరి అంకమ్మకు దక్కగా, బాపట్ల మాజీ శాసన సభ్యులు చీరాల గోవర్ధనరెడ్డి చేతుల మీదగా రూ.40,116లతో పాటు షీల్డును అందజేశారు. మూడవ బహుమతిని చెరుకుపల్లి మండలం పొదిలివారిపాలెం గ్రామానికి చెందిన మంచాల శివసత్యనారాయణరెడ్డి గెలుచుకోగా, పిట్టలవానిపాలెం మాజీ ఎంపీపీ మోదుగుల బసవపున్నారెడ్డి చేతుల మీదుగా రూ.30,116లతో పాటు షీల్డును అందజేశారు. 4వ బహుమతి చెరుకుపల్లి మండలం పొన్నపల్లి గ్రామానికి చెందిన వారి నాగరాజురెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు కళ్లం హరనాథరెడ్డి చేతుల మీదగా రూ.20,116లతో పాటు షీల్డును అందజేశారు. ఐదో బహుమతి చెరుకుపల్లి మండలం పొన్నపల్లికి చెందిన తుమ్మ సాంబశివరెడ్డికి రెడ్డిసంఘం అధ్యక్షుడు చీరాల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముప్పిరి రాజశేఖర్‌ల చేతుల మీదగా రూ.10,116లతో పాటు షీల్డును అందజేశారు. ఆరో బహుమతి అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామానికి చెందిన దేవరకొండ రామకృష్ణకు కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు చేతుల మీదగా రూ.5,116లతో పాటు షీల్డును అందజేశారు. అయితే బెస్టు బెస్ట్ పార్టిసిపెంట్‌గా ప్యాపర్రు గ్రామానికి చెందిన ఏలియా కైవసం చేసుకున్నారు. మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె మధుసూదనరెడ్డి ఆర్థిక సహకారంతో మొత్తం నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె మధుసూదనరెడ్డి, బాపట్ల మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ మోదుగుల బసవపున్నారెడ్డి, నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు, గోవతోటి విజయ్, గొర్రుముచ్చు ఆనందరావు, కర్లపాలెం మాజీ జడ్పీటీసీ సభ్యులు మరుప్రోలు శివారెడ్డి, మద్దాల డేవిడ్ పాల్గొన్నారు.


మొదటి బహుమతి అందిస్తున్న దృశ్యం

రసవత్తరంగా ఎడ్ల పోటీలు

భట్టిప్రోలు: శ్రీ కృష్ణ యాదవ సేవా సమితి (భట్టిప్రోలు) ఆధ్వర్యంలో మండలస్థాయి పోలు రాధా ఎడ్లపోటీలు ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో రసవత్తరంగా జరిగాయి. పోటీలు డ్రా పద్ధతిలో నిర్వహించారు. టైరు బండి తోలుకునే ఎద్దులవరకు ఈ పోటీలలో అనుమతించారు. 100 కిలోల బరువును 6 నిముషాలలో ముగించే ఈ పోటీలలో గొర్రిపర్తి బాలసుబ్రహ్మణ్యం, ఆదిన శివనాగరాజు(భట్టిప్రోలు), కారుమూరు మనోజ్ కుమార్(అద్దేపల్లి), కృష్ణ(సూరేపల్లి), లుక్కా వెంకటేశ్వరరావు, బత్తుల శేషయ్య(వెల్లటూరు), ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతుల కింద రూ.15,116, రూ.10,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116 అందుకున్నారు. డీవీఆర్ మెమోరియల్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ మాట్లాడుతూ దీపావళి పండుగ ఇంతటి ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో రెండో విడత నిర్వహించిన ఈ పోటీలకు అపూర్వ ఆదరణ లభించిందని తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు గ్రామస్తులే కాక చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన రైతులు, ప్రజలు ఆబాలగోపాలం విచ్చేశారు. పోటీల సందర్భంగా మార్కెట్ ఆవరణ అంతా ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు కోలాహలంగా మారింది. బహుమతులను గొర్రిపర్తి కోటేశ్వరరావు కుమారులు, కొలుసు వెంకట సుబ్బారావు కుమారులు, ఆదిన పోతురాజు కుటుంబ సభ్యులు గొర్రిపర్తి వెంకటేశ్వరరావు కుమారుడు ధర్మరాజు, డీవీఆర్ మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డొక్కు వెంకట రామకృష్ణలు అందజేశారు.


ఎడ్ల జత యజమానులకు నగదు బహుమతి, షీల్డ్‌ను అందజేస్తున్న ఎస్ఐ అంబటి చంద్రశేఖర్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రేపల్లె: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14వతేదీ నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని ఇన్‌చార్జి లైబ్రేరియన్ కట్టా స్వాతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి 20వతేదీన నిర్వహించే ముగింపు వేడుకల్లో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

కొల్లూరు: గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు కొల్లూరు, అనంతవరం శాఖా గ్రంథాలయాధికారులు వై.రాంబాబు, కనకదుర్గలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం బాలల దినోత్సవంతో ప్రారంభమవనున్న వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో వ్యాసరచన, డిబెట్, క్విజ్, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కర్లపాలెం: ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని కర్లపాలెం శాఖా గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీన బాలల దినోత్సవం , 15వ తేదీన పుస్తకాల ప్రదర్శన, 16వ తేదీన గ్రంథాలయ ఉద్యమకారుల స్మారక సభ, విద్యార్థులకు క్విజ్ పోటీలు, 17వ తేదీన కవి సమ్మేళనాలు, 18వ తేదీన విద్యార్థులకు ఆటల పోటీలు, వాస్యరచన, వకృత్వం పోటీలు, 19వ తేదీన మహిళా దినోత్సవం 20న విజేతలకు బహుమతుల ప్రదానం ముగింపు సభ జరుగుతుందని గ్రంథాలయాధికారి తెలిపారు.

మత్స్యకారులకు అండగా 'ఎస్ టు నీడ్స్'

బాపట్ల: మత్స్యకారులకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఎస్ టు నీడ్స్‌ను ఎప్పటికీ మరిచిపోమని గ్రామ పెద్ద గోగు శివ పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని అడివిపల్లిపాలెం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామ పెద్ద గోగు శివ మాట్లాడుతూ కరోనా నుంచి అడివిపల్లిపాలెం, కృపానగర్‌లలో ఇంటింటికి సాయం అందించటంతోపాటు ఆర్థిక అభివృద్ధి కల్పించేందుకు ఉపాధి మార్గం చూపారని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు, జీవనోపాధికి చిరువ్యాపారాలు చేసుకునేందుకు తోపుడు బండ్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారని తెలిపారు. ఈసందర్భంగా డైరెక్టర్లు తోట సురేష్‌బాబు, రమ్య పావనిలను సన్మానించారు. మల్లాడి రత్నమ్మ, బొంది దేవుడు, చౌడిపిల్లి అప్పరావు, ఎరిపిల్లి నూకరాజు, జామి సత్యారావు పాల్గొన్నారు.


ఎస్ టు నీడ్స్ డైరెక్టర్ సురేష్‌బాబును సన్మానిస్తున్న అడివిపల్లిపాలెం మత్స్యకార గ్రామాల ప్రజలు

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు పోలీసులు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ రమేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ శివరామయ్యలు కలిసి ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలు వివరిస్తూ వారికి పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఆటోలు నడిపే సమయంలో పాటించాల్సిన నియమావళి, జాగ్రత్తలు గురించి తెలియజేశారు. డ్రైవింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్యాసింజర్‌లను ఎక్కించవద్దన్నారు. అధిక వేగంతో వాహనం నడపవద్దని, ఎక్కడ పడితే అక్కడ వాహనాలను ఆపరాదని, మద్యం తాగి ఆటోలు నడపకూడదన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రమేష్ బాబు, ట్రాఫిక్ ఎస్ఐ శివరామయ్య

ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయండి

తెనాలిఅర్బన్: సీపీఎం ఆధ్వర్యాన విజయవాడలో బుధవారం నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఎస్.భవన్నారాయణ, కొల్లిపర బాబుప్రసాద్ కోరారు. తెనాలి మండల పరిధిలోని అంగలకుదురు, కోపల్లె, గుడివాడ, నందివెలుగు గ్రామాల్లో సోమవారం వారు పర్యంటించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలు

భట్టిప్రోలు: దీపావళి పండుగ వేడుకలను ఆదివారం భట్టిప్రోలు మండలంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవి కటాక్షం ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు చేశారు. గృహాల్లో దీపాల అలంకరణ చేపట్టి బాణసంచా కాల్చి పండుగను ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నారులు, యువకులు టపాసులు కాల్చేందుకు పోటీ పడ్డారు. రంగురంగుల వెలుగులు విరజిమ్ముతున్న టపాసులు కాలుస్తూ ఆనందంగా గడిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి సహపంక్తి భోజనాలు చేసి పండుగను జరుపుకొన్నారు. చిన్నారులు నరకాసురుడిని బొమ్మలు తయారు చేసి అందులో టపాసులు, బాణసంచా పెట్టి దగ్ధం చేశారు.

రేపల్లెలో...
రేపల్లె రూరల్: దీపావళి పర్వదిన వేడుకలను ఆదివారం ప్రజలు వైభవంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని సాయంత్రం సమయంలో లక్ష్మి అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి ముంగిళ్లల్లో కాంతులు విరజిమ్మేలా దీపాలను ఏర్పాటు చేశారు. చిన్నారులు, పెద్దలు టపాసులను వెలిగించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని గ్రామదేవత బూరగలమ్మ అమ్మవారి ఆలయంలో, ఓల్డ్‌టౌన్‌లోని ఉమా మహేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఓల్డ్‌టౌన్‌లోని అంకమ్మ చెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెట్టు వద్ద అంకమ్మతల్లికి బజారు ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులు దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలను చాటారు.


రేపల్లె అంకమ్మ చెట్టు వద్ద భక్తులు వెలిగించిన దీపాలు


శివలింగాకారంలో వెలిగించిన దీపాలు


భట్టిప్రోలులో గాజు గ్లాసుల్లో నీటి దీపాల వెలుగులు

ముస్లిం ఐక్యవేదిక పోస్టర్లు ఆవిష్కరణ


ముస్లిం ఐక్యవేదిక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముస్లిం పెద్దలు

బాపట్ల: ముస్లిం సామాజిక అభివృద్ధి కోసం ఈనెల 26వ తేదీన నిర్వహిస్తున్న ఐక్యవేదికను విజయవంతం చేయాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ అలీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అన్నం సతీష్‌ప్రభాకర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా జాఫర్ అలీ మాట్లాడుతూ ముస్లిం సంక్షేమానికి అసోసియేషన్ చేపట్టే ఐక్యవేదికలో ప్రతి ఒక్కరు పాల్గొన్నాలని సూచించారు. ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, నాయకులు జియాఫల్ రహమాన్, సయ్యద్ ఖలీల్, అజీజ్, అబ్దుల్ కలాం, బాజీ, మౌలా బేగ్, గౌస్ బాషా, మహమ్మద్ ఖాన్, తాజు, జిలాని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

16న కార్తిక సమారాధన



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో కొలువైన పైడమ్మ తల్లి అమ్మవారి దేవస్థానంలో కార్తిక మాసం పురస్కరించుకుని మంగళవారం నుంచి నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు కూరపాటి రఘురామయ్య సోమవారం తెలిపారు. 16వ తేదీన అమ్మవారి సన్నిధిలో కార్తీక వన సమారాధన జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు ఈ సమారాధనకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

నేటి నుంచి కార్తిక మాస పూజలు

ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం): కార్తిక మాసం సందర్భంగా పూజా కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మండలంలోని ఖాజీపాలెం కాశీవిశ్వనాథస్వామి దేవాలయం, అల్లూరు రాజ్యలక్ష్మీసమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, చందోలు లింగోద్భవస్వామి దేవాలయంలో కార్తిక మాసంలో ప్రతి రోజూ ఉదయం, సాయంత్ర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆయా ఆలయ నిర్వాహకులు తెలిపారు. మహిళలు తెల్లవారుజామున పుణ్య స్నానమాచరించి, ఉపవాసముండి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. ఈసందర్భంగా ఖాజీపాలెం కాశీవిశ్వనాథస్వామి దేవాలయం ఆలయ ప్రధాన అర్చకుడు వారణాశి వేంకట రామకృష్ణ మాట్లాడుతూ కార్తిక మాసం సందర్భంగా ప్రతి రోజూ పూజలు నిర్వహించడంతో పాటు ప్రతి సోమవారం కార్తిక దీపాలు వెలిగించడం ఆనవాయితీగా జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి రావడంతో దేవాలయం కిటకిటలాడింది.

నేడు పోతనకట్టవారి పాలెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పిట్టలవానిపాలెం: మండలంలోని పోతనకట్టవారిపాలెం గ్రామంలో ఈనెల 14వ తేదీన ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద నవరత్నాలు లబ్ధిదారుల డిజిటల్ డిస్ప్లే బోర్డును ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలుత గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు పాతనందాయపాలెంలో ...
కర్లపాలెం: మండలంలోని పాతనందాయపాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించనున్నారని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఏడుకొండలు తెలిపారు. అనంతరం కర్లపాలెం గ్రామ సచివాలయం వద్దకు చేరుకుని సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తారని తెలిపారు. అక్కడ సభ అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి గ్రామ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లతో కలసి ప్రతి గడప గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు అందిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి గ్రామంలోని సమస్యలు తెలుసుకుని, పల్లెనిద్ర కార్యక్రమం ఉంటుందని ఏడుకొండలు తెలిపారు.

రత్నబోస్‌కు ఘన నివాళులు

రేపల్లె రూరల్: విశ్రాంత ఉపాధ్యాయుడు మార్పు రత్నబోస్ సంస్మరణ కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత ఉద్యమాలలో ఆయన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. మచిలీపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ మేకతోటి దయాసాగర్, ఏఎస్పీ మాతంగి అశోక్‌బాబు, ఐఆర్‌ఈఎఫ్ విద్యాసంస్థల అధినేత రెబ్బా ఇమ్మానుయేల్, వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, ఉద్యోగ సంఘాల నాయకులు దర్శి భాస్కరరావు, రెబ్బా జాన్‌పాల్, మేకతోటి ప్రసాదరావు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో ధర్మ రక్ష దినోత్సవాలు

భట్టిప్రోలు: సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మ రక్ష దినోత్సవాలను సోమవారం భట్టిప్రోలులోని శ్రీ సాయికృష్ణ కల్యాణ మండపం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతుందని బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, రేపల్లె సబ్ డివిజన్ కన్వీనర్ క్రాప రవికుమార్, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.